# రోజంతా వాన.. జనం హైరానా

- పలు ప్రాంతాల్లో నిలిచిన వర్షపునీరు
- స్తంభించిన జనజీవనం
- ఊపందుకున్న వ్యవసాయ పనులు


ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ వెనుక వీధిలో నిలిచిన వర్షపునీరు


ఏలేశ్వరంలో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీటిలో మహిళల ఇబ్బందులు

ప్రత్తిపాడు: జూన్ నెల మధ్యంతరం వరకు కూడ ఉష్ణతాపంతో అల్లాడిన ప్రజానీకం మంగళవారం రాత్రి నుంచీ కురుస్తున్న వర్షాలు ఉపశమనం కలిగించింది. బుధవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా ఓమోస్తరు నుంచి భారీగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో నేలంతా చిత్తడిచిత్తడిగా మారింది. రైతాంగం పొలంబాట పట్టారు. నేలకు పదును చేరడంతో నారుమడులను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. వర్షం కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లమ్మటి పారుతు పల్లపు ప్రాంతాలకు నీరు చేరింది. కురిసిన వానకు ప్రత్తిపాడులోని అల్లూరి సీతారామరాజు జంక్షన్‌తో పాటు పలు వీధుల్లో రోడ్లమీదే వాన నీరు తిష్టవేసింది.

**ఏలేశ్వరంలో,,**

ఏలేశ్వరం: అల్పపీడన ప్రభావంతో నియోజవర్గ వ్యాప్తంగా రోజంతా భారీ వర్షం కురుస్తునే ఉంది. అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. వర్షానికి రహదారులు, పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. రోజంతా వర్షం పడడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పట్టణంలోని పలుప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు నిలవడంతో ప్రధాన రహదారిపై మహిళలు, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానిక లింగవరంకాలనీ, చైతన్యనగర్ కాలనీ, తదితర కాలనీల్లోని రహదారులు బురదమయంగా మారాయి. ఈ వర్షాలు ఖరీఫ్‌కు అనుకూలంగా ఉంటాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు అంటురోగాలు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఎడతెరిపి లేకుండా..**

ప్రత్తిపాడు రూరల్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో మండల వ్యాప్తంగా గ్రామాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశంలో మేఘాలు కమ్ముకుని తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో మండలంలోని రాచపల్లి, ఒమ్మంగి, శరభవరం, చింతలూరు, గజ్జనపూడి రహదారుల గోతుల్లో వర్షపు నీరు నిలిచి రోడ్లు అధ్వానంగా మారాయి. ఏకధాటిగా కురుసిన వర్షానికి అత్యవసర పనులు ఉంటే మినహా ఎవరూ బయటకు రాలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పనులకు ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

**వర్షంతో ఇబ్బందులు**

తుని: నైరుతి ప్రభావంతో కుండపోతగా కురుస్తున్న వర్షంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం ఏకధాటీగా వర్షం కురిసింది. దీనితో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు ప్రాంతాల్లోని కాలువల్లో తీసిన పూడిక వర్షానికి మళ్లీ కాలవల్లోకి చేరింది. ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పత్తి, కూరగాయలు, వరినారు మళ్లకు ప్రయోజనం కలిగింది. వాతారణ మార్పులతో సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.


గజ్జనపూడిలో కురుస్తున్న వర్షం

## క్లుప్తంగా

### రోడ్డు వేసి.. వదిలేశారు


లింక్‌లు కలపక నిరుపయోగంగా మారిన సీసీ రోడ్డు

ఏలేశ్వరం: అధికారులు రోడ్డు వేస్తే సరిపోతుందని అనుకున్నారో ఏమో. సగం రోడ్డుపై ప్రజలు రాకపోకలు ఎలా సాగిస్తారని ధ్యాస లేకుండా నిర్మాణాన్ని సగంలో వదిలేశారు. స్థానిక జయశ్రీ పేలస్ వెనుక కాలనీలో ఇటీవల సీసీరోడ్డు వేశారు. సుమారు 15 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు దీనికి ఇరువైపులా ఎటువంటి లింక్‌లు కలపలేదు. రోడ్డు మూడు అడుగుల ఎత్తు వేయగా వాహనాలు వెళ్లేందుకు మట్టి చదును చేయలేదు. దీంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించేందుకు వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పడిన వర్షాలకు రహదారిని అనుకుని ఉన్న పల్లపుప్రాంతం చెరువులా మారింది. వేసిన రహదారిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

### ఆదిత్యలో ఎన్‌సీసీ వార్షిక ట్రైనింగ్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 18 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ వార్షిక ట్రైనింగ్ క్యాంపు ఉత్సాహంగా జరుగుతున్నట్టు క్యాంప్ కమాండెంట్ మేజర్ కె.మహమ్మద్ ఆసిఫ్ తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థుల నడవడికలో క్రమశిక్షణ, రైఫిల్ వినియోగం, డ్రిల్, మ్యాప్ రీడింగ్, దేశభక్తి, ఆరోగ్యం పరిశుభ్రత, నాయకత్వ లక్షణాలు, తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

### ఏపీ పీజీఈసెట్‌లో మెరిసిన ఆదిత్య విద్యార్థిని


విద్యార్థిని సుమిత్రను అభినందిస్తున్న వైస్ చైర్మన్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాల విద్యార్థిని మల్లిపాటి సుమిత్ర ఏపీ పీజీఈసెట్–2025లో రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంకు సాధించినట్టు వైస్ చైర్మన్ ఎస్.సతీష్ రెడ్డి తెలిపారు. ర్యాంకుతో పాటు ఎం.ఫార్మసీ, ఎంటెక్ ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించిన నైపర్ జెఈఈ పరీక్షల్లో అర్హత సాధించినట్టు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో 35 మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారన్నారు. సుమిత్ర, తల్లితండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.సతీష్ కుమార్, కె.రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు మాజీ మంత్రి పర్యటన

కోటనందూరు: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా గురువారం మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీపీ లగుడు శ్రీనివాసు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బొద్దవరం గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్ పెతకంశెట్టి అప్పలనాయుడు కుటుంబ సభ్యులను ఆయన గురువారం పరామర్శిస్తారన్నారు. కావున మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట తరలిరావాలని ఎంపీపీ కోరారు.

### విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

కిర్లంపూడి: మండలంలోని రామకృష్ణాపురంలో వ్యవసాయ శాఖ అధికారి సుధామాధురి అధ్యక్షతన బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. రైతులకు విత్తన శుద్ధి పంటలకు రోగ నివారణ, తెగుళ్ల నియంత్రణ, మొలక శక్తి పెంపుదల, పంట రక్షణ, రసాయన వినియోగం తగ్గింపు, అధిక దిగుబడులు వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ నారుమళ్లు వేసే ముందు విత్తన శుద్ధి సరైన పద్ధతిలో చేయడం ద్వారా నారుకు ఎటువంటి తెగుళ్లు ఆసించవని సూచించారు. అనంతరం బీజామృతం ద్వారా విత్తన శుద్ధి చేసే పద్ధతిని ప్రయోగాత్మకంగా రైతులకు చూపించారు. వీఏఏ రమ్య తదితరులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


పెదశంకర్లపూడిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు: వివిధ కారణలతో అనారోగ్యం బారిన పడిన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మెరుగైన వైద్య సేవలు పొందవచ్చని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు బుధవారం సీఎంఆర్ఎఫ్ నిధులు రూ.13,95,118 చెక్కులను నాయకుల సమక్షంలో ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, ఏలూరు గ్రామ సర్పంచ్ రొంగల సత్యనారాయణ, బద్ది రామారావు, అడ్డాల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: ఎన్నికల సమయంలో ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన మోసాల చిట్టాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న కాకినాడలోని సూర్యకళా మందిర్‌లో ఉదయం 9:30 గంటలకు పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యన్నారాయణ ఆధ్వర్యంలో జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 'బాబు షూరిటీ... మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు చేసిన వాగ్ధానాలను గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, మండలాధ్యక్షులు, జడ్పీటీసీలు, ప్రతినిధులు, స్థానిక నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## అధినేతను కలసిన వైఎస్సార్ సీపీ నేతలు


జగన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి తోట నరసింహం, శ్రీరాంజీ


తాడేపల్లిలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జ్యోతుల చంటిబాబు

తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి జగ్గంపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తోట నరసింహం, ఆయన తనయుడు పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ హాజరయ్యారు. అలాగే మాజీ సీఎం జగన్‌ను జగ్గంపేట వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలికుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు మర్యాద పూర్వకంగా కలిశారు.

– జగ్గంపేట


తాడేపల్లిలో జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన ముదునూరి మురళీ కృష్ణంరాజు

## వైభవంగా మరిడమ్మ తల్లి జాతర


మరిడమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ అమ్మవారు

అన్నవరం: అన్నవరం రైల్వేస్టేషన్ రోడ్డులోని గ్రామ దేవత శ్రీమరిడమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని జ్యేష్ట అమావాస్య సందర్భంగా బుధ వారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారి ఆలయానికి విచ్చేసి పొంగలి దూపదీపాలు, నైవేద్యాలు సమర్పించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు, టీడీపీ నాయకుడు యనమల రాజేష్, తదితరులు దర్శించి పూజలు చేశారు. ఎంపీటీసీ దడాల సతీష్, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు, కొండపల్లి అప్పారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు నాయకులకు ఘనంగా స్వాగతం పలికారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌కు చేయూత

బోట్‌క్లబ్: రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌కు ఓఎన్‌జీసీ చేయూతనివ్వడం ఆనందంగా ఉందని ఓఎన్‌జీసీ ఈస్ట్రన్ ఆఫ్‌షోర్ ఈడీ రత్నేష్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ స్కిల్ డెవలప్‌మెంట్ ల్యాబ్ హాల్‌లో ఓఎన్‌జీసీ 30 కంప్యూటర్లు, ఇంటరాక్టివ్ ప్యానల్ అందించారు. దీని ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రత్నేష్‌కుమార్ మాట్లాడుతూ, సామాజిక సేవా కార్యక్రమాలకు తమవంతు సాయంగా స్కిల్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌కు కంప్యూటర్లు, ఫర్నిచర్, ఇంటరాక్టివ్ ప్యానల్ అందించామన్నారు. నిరుపేదలకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఉచిత శిక్షణ అందిస్తున్నారన్నారు.

## దేశ చరిత్రలో చీకటి రోజు

తుని: భారతదేశంలో ఎమర్జెన్సీ విధించి బుధవారంతో 50 ఏళ్లు నిండాయని ఆర్ఎస్ఎస్ తుని వ్యవస్థ ప్రముఖ్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో అఖిల భారత విద్యార్థి పరిషత్ తుని శాఖ ఆధ్వర్యంలో ఈ అంశంపై సెమినార్ నిర్వహించారు. 1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యానికి పాతరేసి, నియంతృత్వం రాజ్యమేలుతూ దేశంలో ఎమర్జెన్సీని విధించారన్నారు. కాంగ్రెస్ పార్టీ విధించిన ఈ ఎమర్జెన్సీ దేశ చరిత్రలో ఒక చీకటి రోజన్నారు. దేశపౌరులు, పత్రికలు, ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ అణచివేతకు గురయ్యాయన్నారు. అటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా రాజ్యాంగ పరిరక్షణకు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. రాజమండ్రి విభాగ్ కన్వీనర్ సత్యసాయి, కాకినాడ కన్వీనర్ చందు, సూర్యకుమార్, కృష్ణ, రాజా, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



పాండవులపాలెం గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు

ప్రత్తిపాడు రూరల్: గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయని జిల్లా ఎస్సీ సెల్ వెల్ఫేర్ అధికారి మల్లిఖార్జునరావు తెలిపారు. మండలంలోని పాండవులపాలెం, బవురువాక గిరిజన గ్రామాల్లో బుధవారం స్థానిక తహసీల్దార్ ఎం సూర్యప్రభ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. నియోజకవర్గంలోని పాండవులపాలెం, బవురువాక, పెద మల్లాపురం, వేళంగి, రాఘవపట్నం, శృంగధార గిరిజన గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేశాయని తెలిపారు. ఈ గ్రామాల్లో వసతులు మెరుగుదల, ఏర్పాటుపై పరిశీలన చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామ సభల్లో గిరిజనులు పీఎం జనధన్, తల్లికి వందనం, రహదారులు, తాగునీరు, విద్యుత్ అంగన్‌వాడీ, వైద్య సేవలు వంటి సమస్యలను వివరిస్తూ వినతి పత్రాలను అధికారులకు అందజేశారు. ఈ సభల్లో డిప్యూటీ ఎంపీడీఓ కాశీవిశ్వనాథ్, సర్పంచ్‌లు గుమ్మిడి రామలక్ష్మీ, దొడ్డి సత్యనారాయణ, ఎంఈఓ రాజబాబు, ఏపీఓ కుమారస్వామి, పీఆర్ జేఈ సత్యప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బలక్ష్మీ గ్రామ కార్యదర్శి బి.వీరబాబు, వీఆర్వో సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే బిడ్డకు ఆరోగ్యం


ఎస్.అన్నవరంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ

తుని రూరల్: తుని మండలం ఎస్.అన్నవరం సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీలు సూపర్‌వైజర్ వై.వి. రమణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాడ్యుషన్ డే వేడుకలలో ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత పాల్గొన్నారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలతో అక్షరాభ్యాసం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ గ్రాడ్యుషన్ డేలో పాల్గొన్న చిన్నారులను పాఠశాలల్లో చేర్పిస్తున్నట్టు తెలిపారు. తల్లులందరూ తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు, ఆరేళ్లు నిండిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అప్పుడు బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తుందన్నారు. మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమ్మతల్లి, సరోజిని, తల్లులు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

## యువకుడిని కాటేసిన కింగ్ కోబ్రా


బాధితుడికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

ప్రత్తిపాడు: మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెందిన ఉర్లంకల మణికుమార్ (27)ను కింగ్ కోబ్రా జాతికి చెందిన పాము కాటు వేసింది. బుధవారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని, పొద్దుపోయే సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా కుడికాలు బొటన వేలిపై పాము కాటు వేసింది. దీనితో బాధితుడు కేకలు విని, సహచరులు పాము కింగ్ కోబ్రా జాతికి చెందినదిగా గుర్తించారు. అపస్మారక స్థితికి చేరుకున్న మణికుమార్‌ను బంధువులు ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ బి.సౌమ్య మైఖేల్ తదితర సిబ్బంది సుమారు మూడున్నర గంటల పాటు వైద్య చికిత్స అందించారు. 20 యాంటి స్నేక్ వీనమ్ ఇంజక్షన్లు అందించామని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ తెలిపారు. బాధితుడు కోలుకోవడంతో బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

## విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

జగ్గంపేట: మండలంలోని రాజపూడి రూరల్, ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం నుంచి చెట్టు కొమ్ములు నరికివేత, లైన్లు, ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు జగ్గంపేట విద్యుత్‌శాఖ డిఇ బి.వీరభద్రరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఉదయం 8.గంటల నుంచి మధ్యాహ్నం 2.గంటల వరకూ రాజపూడి, కొత్తూరు, మల్లిశాల, వెంగయమ్మపురం ,గోవిందపురం,కృష్ణాపురం, సీతారంపురం, గ్రామాలతో పాటు భావవరంలోని వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ సరఫధా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలన్నారు.

**రేపు తునిలో అంతరాయం**

తుని: వీరవరపుపేట సబ్‌స్టేషన్లో లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ వీరభద్రరావు బుధవారం తెలిపారు. తుని పట్టణంలోని వీరవరపుపేట, కొబ్బరితోట, కొత్తసూరవరం, రామకృష్ణ కాలనీ, గవరపేట, ఉప్పరగూడెం ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ అంతరాయాన్ని గమనించి కావున పట్టణ ప్రజలు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు

## నీరు పారేదెలా ?

కిర్లంపూడి: వాతావరణం అనుకూలించడంతో రైతులు ఖరీఫ్ పనులకు సన్నద్ధమయ్యారు. కిర్లంపూడిలోని సింహాద్రి కాలువ ద్వారా వందల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం ఈ కాలువలో చెత్త చేదారాలు, తూటికాడ, గడ్డి, పిచ్చిమొక్కలు పేరుకుపోయి సాగునీరు పారేందుకు ఆటంకంగా మారాయి. ఇరిగేషన్ అధికారులు స్పందించి త్వరితగతిన స్పందించి కాలువలో పేరుకుపోయిన చెత్త చేదారాలు, తూటికాడ, గడ్డి, పిచ్చిమొక్కలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.


కిర్లంపూడి సింహాద్రి కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, గడ్డి

### రాచపల్లిలో పొలం పిలుస్తోంది

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జోకా అమృత మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సన్న రకాలు విత్తుకోవాలన్నారు. సంవత్సరంకాల వ్యవధిలో మూడు పంటలు వేసే విధంగా ప్రణాళిక వేసుకోవాల్సిందిగా రైతులకు విజ్ఞప్తి చేశారు. సేంద్రియ వ్యవసాయంపై రైతుల ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. విత్తనశుద్ధి గురించి ప్రయోగాత్మంగా రైతులకు తెలియజేయజేశారు.

### వనదుర్గమ్మకు ప్రత్యంగిర హోమం


అమ్మవారికి ప్రత్యంగిర హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి దుర్గామాతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి జ్యేష్ట అమావాశ్య పర్వదినం సందర్భంగా బుధవారం ఘనంగా ప్రత్యంగిర హోమం నిర్వహించారు. 11.గంటలకు వేదపండితులు యనమండ్ర శర్మ ఘనపాఠీ, గంగాధరబట్ల గంగబాబు, అర్చకులు దత్తాత్రేయశర్మ, కోట వంశీ పండితుల ఆధ్వర్యంలో హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

### సీఐ, ఎస్సైలకు ప్రశంసలు


ప్రశంసా ప్రతాన్ని అందుకుంటున్న సీఐ వైఆర్‌కె శ్రీనివాస్


ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్సై రఘునంధన్‌రావు

జగ్గంపేట: జగ్గంపేట పోలీసు సర్కిల్ పరిధిలో గత కొద్ది నెలలుగా గంజాయి రవాణపై ఉక్కుపాదం మోపి పెద్ద ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకోవడం, ముద్దాయిలను పట్టుకోవడంతో సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, జగ్గంపేట ఎస్సై రఘునందన్‌రావులను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించి ప్రశంసా పత్రాలు అందచేశారు. కాకినాడ ఎస్పీ కార్యాలయంలో బుధవారం సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, జగ్గంపేట ఎస్సై రఘునథన్‌రావులకు ఎస్పీ ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు సీఐ,ఎస్సైలకు అభినందనలు తెలిపారు.

### పారిశుధ్యంపై అవగాహన కల్పించాలి

శంఖవరం: పారిశుధ్య నిర్వహణపై గ్రామ ప్రజల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా పంచాయతీ అధికారి పి.రవికుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని కత్తిపూడి, కొంతంగి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డోర్ టూ డోర్ తడి, పొడి చెత్త సేకరణ తీరును ఆయన పరిశీలించారు. ప్రస్తుతం అమలవుతున్న విధానంలో లోపాలను ఆయన గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజల్లో స్పందన పెరగాలంటే పంచాయతీ కార్యదర్శులు చురుగ్గా వ్యవహహరించాలన్నారు. ఈఓపీఆర్డీ చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థుల ఎంపిక

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. జగ్గంపేట మండలం మల్లిసాలకు చెందిన పి.తేజశ్రీనాగు ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు, గోకవరం మండలం కొత్తపల్లికి చెందిన ఎం.బాలరాజేష్ ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు, గోకవరం మండలం మల్లవరంకు చెందిన పి.మనోహర్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు ఎంపికయ్యారు.